# అశాంతి పర్వం

'యుద్ధాలు చేసే సైనికులలో, పదిహేను శాతం మాత్రమే రణరంగంలో ఇంకో మనిషిని చంపటానికి వెనకాడరని గణాంకాలు చెబుతున్నాయి' అన్నాడు బాబ్.

'మరి మిగతా 85 శాతం?' అడిగాను.

'పాతిక శాతం చంపటానికి ఇష్ట పడరు కానీ, కొంచెం గుండె నిబ్బరంతో సర్దుకోగలుగుతారు. ఇంకో 50 శాతం యుద్ధరంగంలో వున్నారు కనుకా, చంపక పోతే తామే చనిపోయే అవకాశముంది కనుక ఆ పని చేస్తారు. కానీ తరువాత ఎన్నో సంవత్సరాలు 'యుద్ధం తర్వాత వుండే మానసిక అలజడి' (పోస్ట్‌వార్ ట్రోమా)వల్ల చాల ఇబ్బందులకి గురవుతారు' ఆగాడు బాబ్.

'మరి మిగతా పది శాతం?' అడిగాను, నా లెఖ్కల గొప్పతనం చూపిస్తూ.

'ఏముంది. విపరీతమైన మానసిక క్షోభకి గురయి, చివరికి ప్రాణాలు విడిచే వాళ్ళ కథలు వింటుంటాం' అన్నాడు కెవిన్.

నాకెందుకో బాధ వేసింది. అమెరికా కానీయండి, ఇండియా కానీయండి, ఏ దేశమైనా కానీయండి - రాజకీయ కారణాల వల్ల దేశం కోసం యుద్ధాలలో ప్రాణాలు తెగించి పోరాడటమే కాక, ఒకవేళ ప్రాణాలతో బయటపడితే, ఆరోగ్యంగా బ్రతకటానికి తమ ప్రాణం కోసం మరో యుద్ధం!

ఓ మనిషీ! ఎటు వెడుతున్నావు?

'ఈ మధ్య ఒక వ్యాసం చదివాను. విచిత్రమైన పరిశీలన' అన్నాడు బాబ్.

'అదేమిటో చెప్పు బాబూ.. బాబ్' అన్నాను కుతూహలంగా.

బాబ్ అన్నాడు 'మా చిన్నప్పుడు, అంటే మూడు దశాబ్దాల క్రితం, మేము చూసిన కార్టూన్లు చాల సరదాగా అహింసాపరంగా వుండేవి. మిక్కీ మౌస్, టాం అండ్ జెర్రీ, జెట్‌సన్స్, ఫ్లింట్‌స్టోన్స్ మొదలైనవి. ఇప్పుడు కార్టూన్లలో ఎక్కడ చూసినా ఒకళ్ళనొకళ్ళని చంపుకోవటమే. కార్టూనుల కన్నా కూడా కంప్యూటర్ ఆటలు ఇంకా ఘోరం. ఏ ఆట చూసినా కత్తులు పెట్టి నరుక్కోవటం, సజీవంగా తగలపెట్టటం, వట్టి చేతులతో చంపేయటం, తుపాకులతో కాల్చి పారేయటం. అలాటి పిల్లలు పెద్దయాక ఎలా పెరుగుతారు? అనేదే ముఖ్యాంశం ఆ వ్యాసంలో. ఇంకా నయం. మన దేశంలో అలాటి సినిమాలకి పిల్లల్ని రానీయరు. మిగతా చాల దేశాల్లో ఎంత హింస వున్నా పిల్లలు చూడొచ్చుట'

అతనితో అనలేదు కానీ నా మనసులో అనుకున్నాను, మరి మన ఇండియాలో పెరిగే పిల్లల సంగతేమిటని?

పిల్లల సంగతి సరే, మరి అలాటి సినిమాలు చూసే పెద్దల సంగతి? వారి మనస్తత్వం ఎలా వుంటుంది? ఎలాటి మార్పులు చెందుతుంది? అని కూడా అనుకున్నాం పోయిన వారం. మా చర్చలోనూ, టీవీలో సి.ఎన్.ఎన్. వార్తల్లో సైకాలజిస్ట్ చెప్పినవీ విన్న తర్వాత ఈ ప్రశ్నలకి జవాబులు కొంతవరకైనా దొరికినట్టు

అనిపించింది.

గత పదిహేనేళ్ళుగా పైన చెప్పిన గణాంకాలలో చాల మార్పు వచ్చిందిట. యుద్ధానికి వెళ్ళేవాళ్ళల్లో ఇంతకు ముందు కన్నా కూడా ఎక్కువమంది శత్రువుల ప్రాణాలు తీయటానికి వెనకాడటం లేదనీ, అందువల్ల ఈ ట్రోమా చాలమందిలో తక్కువగా కనిపిస్తున్నదనీ! అది మంచికా? చెడుకా? చూద్దాం.

అసలు ఈ 'యుద్ధం తర్వాత వుండే మానసిక అలజడి' (పోస్ట్ వార్ ట్రోమా) అనేదెలా వస్తుందనే విషయంలో, అమెరికాలో ఆగష్టు 2004లో సేకరించిన గణాంకాలు ఇలా వున్నాయి.

18.3 శాతం సైనికులు మాత్రమే కొంచెం ఎక్కువ నించీ విపరీతంగా దీనికి గురి అవుతున్నారుట! వీరిలో సాధారణంగా మానసిక అలజడి (మెంటల్ యాంక్జైటీ), మానసిక వ్యాకులత (మెంటల్ డిప్రెషన్), అంతకన్నా ఎక్కువది పి.టి.యస్.డి. (పోస్ట్ ట్రొమేటిక్ స్ట్రెస్ డిసార్డర్)లతో బాధలు పడుతున్నారుట. అయినా వీరిలో 10.4 శాతం మాత్రమే డాక్టర్ల దగ్గరికీ, సైకాలజిస్టుల దగ్గరికీ వెడుతున్నారు.

మరి వీరికి ఈ మానసిక అలజడి ఎలా వస్తున్నది అన్నదానికీ కొన్ని అంకెలు వున్నాయి.

వీరిలో నూటికి కనీసం 95మంది కాల్పులు (తుపాకీలతో కానీ, మంటలతో కానీ) చవిచూసిన వారుట.

94.5 శాతం శవాలతోనూ, శరీర భాగాల మధ్యా వున్నవారు.

86.5 శాతం తమకి బాగా స్నేహితులైనవారు తమ కళ్ళ ముందే చనిపోతుంటే అసహాయులుగా వుండి పోవాల్సి వచ్చిందిట.

76 శాతం శత్రు ప్రదేశాల్లో అన్నెంపున్నెం ఎరుగని పసిపాపలూ, స్త్రీలూ చనిపోవటం చూశారుట.

ఇవన్నీ చూసిన ఎంత గుండె నిబ్బరం వున్నవారైనా మానసిక వ్యాధులకి గురవటం సహజం కాదూ!

ఈ హింసాత్మకమైన కంప్యూటర్ ఆటలూ, సినిమాలూ తెచ్చిన మార్పులు ఒక విధంగా అలా ఉపయోగపడు తున్నాయా? ఏమో, నాకు తెలీదు.

మరి ఒక విధంగా అది లాభమయితే, ఆ మనస్తత్వం వల్ల సంఘంలో నష్టాలు వుండవూ!

ఎందుకు వుండవూ, సుబ్బరంగా వుంటాయి.

అందుకేగా ఈ ప్రపంచంలో మత కలహాల రక్తతర్పణం, రాజకీయ నాయకుల గూండాయిజం, ఎన్‌కౌంటర్లు, మాఫియాలూ, బాంబు దాడులూ, హత్యలూ, మానభంగాలూ, హింసాకాండ. ప్రతిచోటా... అదే!

ఎవరికైనా ఈ సమస్యకి పరిష్కారం ఏమిటో, భవిష్యత్తులో ప్రపంచ శాంతి ఏమవుతుందో అని ఆలోచించే తీరికా, అవసరం వున్నాయా?

0 0 0